క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



ఉంగుటూరు: రోడ్డు ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. మండలంలోని నందమూరు గ్రామానికి చెందిన ముల్లంగి గణేష్ గుడివాడ-విజయవాడ ప్రధాన రహదారిలో గురువారం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చేరాడు. అతను ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు వాట్సాప్ ద్వారా ఎమ్మెల్యే వంశీకి సందేశాన్ని పంపించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఆ యువకుడికి రూ.20 వేలు అందజేశారు. ఫోన్‌లో గణేష్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. స్థానిక నాయకులు సలివేంద్ర రామకృష్ణ, గొన్నూరు సీమయ్యఆర్థిక సాయాన్ని అందజేశారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్టులో నలంద విద్యార్థులు



కంకిపాడు: షూటింగ్ బాల్ జిల్లా జట్టుకు ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ విద్యార్థులు ఎంపికయ్యారు. సత్తా చాటిన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 19న గన్నవరంలోని స్రవంతి హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జరిగిన ఎంపికల్లో పాఠశాలకు చెందిన కె.వర్షిత్, డి.సంతోష్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత విజయబాబు విద్యార్థులను అభినందించారు.

గంగూరులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

పెనమలూరు: గంగూరు గ్రామంలో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. గ్రామంలో సర్పంచి తస్లీము న్నీసా, ఆమె భర్త అక్బర్ పాషా గ్రామంలో గురువారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లింలు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, సర్పంచిలు కాకర్ల వెంకటరత్నం, లింగాల భాస్కరరావు, గంటూరు శ్రీనివాసచౌదరి, ఏవో లోయ శివశంకర్, వైఎస్సార్ సీపీ నేతలు, ముస్లింలు పాల్గొన్నారు.

ముస్లింలకు పండ్లు పంపిణీ

కంకిపాడు: జగనన్న సచివాలయాల మండల ఇన్‌చార్జి రాచూరి చిరంజీవి వితరణతో శుక్రవారం కంకిపాడులో ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మసీదు పెద్ద అమీర్, మసీదు కమిటీ ప్రతినిధి కాలేషా వలిని సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా సహాయ కార్యదర్శి మాదు వసంతరావు, ఎంపీటీసీ చిట్టూరి ప్రసాద్, నాయకులు షేక్ అహ్మద్, అబ్దుల్లా, కరీముల్లా, కొప్పరాజు సురేష్ పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ

కంకిపాడు: పేదలను ఆదుకోవటం సామాజిక బాధ్యత అని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన షేక్ మస్తాన్‌షరీఫ్ కుమారుడు షేక్ ఫిరోజ్ వితరణతో ఈడుపుగల్లులోని 35 మంది పేద ముస్లిం మహిళలకు చీరలను గురువారం రాత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ లాల్ అహ్మద్, షేక్ బాజీబీ పాల్గొన్నారు.

కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యత టీచర్లు, తల్లిదండ్రులదే

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వ రంగ విద్యాసంస్థల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీలపైనే ఉందని గుడివాడ డీవైఈవో ఎ.రవిప్రకాష్ అన్నారు. నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం జరిగింది. డీవైఈవో రవిప్రకాష్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అనేక విప్లవాత్మక చర్యలను చేపట్టిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న కార్యక్రమాల తీరును పరిశీలించడానికి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, అవసరాలు, వృత్తి విద్య తదితర అంశాలను సామాజిక తనిఖీలో పరిశీలిస్తారని వివరించారు. తల్లిదండ్రుల భాగస్వామ్యం మరింత పెంచడానికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు రిసోర్స్‌పర్సన్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంఈవో సక్సేనా రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు, కె.లూథర్‌పాల్, కొమ్మా విజయ్, సీహెచ్ సుబ్బారావు, నిర్మల, సుదర్శనం పాల్గొన్నారు.



విద్యుత్ కాంతులతో ఈడుపుగల్లు మసీదు



విద్యుద్దీపాలతో ప్రత్యేక అలంకరణలో గోసాల సెంటరు మసీదు

రంజాన్‌కు ముస్తాబైన మసీదులు



కంకిపాడు బైపాస్ వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధం చేసిన టెంట్‌లు

పవిత్ర రంజాన్ పర్వదినానికి మసీదులు ముస్తాబయ్యాయి. కంకిపాడు, ఈడుపుగల్లు, గోసాల సెంటర్లలో మసీదులు విద్యుత్ కాంతులతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి. కంకిపాడు బైపాస్ మార్గం వెంబడి ఖాళీ ప్రదేశంలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

–కంకిపాడు

కోడిపందేలు ఆడేవారు విమర్శలు చేయడం సిగ్గుచేటు

ఎమ్మెల్యే వంశీమోహన్

గన్నవరం: టీడీపీ అధ్యక్షుడి జన్మదినం సందర్భంగా గన్నవరంలో నిర్వహించిన వేడుకల్లో దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ శుక్రవారం కౌంటర్ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ...కోడిపందేలు, పేకాట ఆడిస్తూ పోలీసులు రాగానే పారిపోయే వ్యక్తులు కూడా దమ్ము, ధైర్యం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటువంటి వారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, తనపై విమర్శలు చేయడం శోచనీయమన్నారు. టీడీపీ వెంటిలేటర్‌పై ఉండటంతో చంద్రబాబు ఇదే చివరి ఎన్నికలు అంటున్నారని తెలిపారు.

రూ.24 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి



అభివృద్ధి చేసిన గంగూరు ముస్లిం శ్మశానవాటిక

పెనమలూరు: గంగూరు గ్రామంలో ముస్లిం శ్మశానవాటికను రూ.24 లక్షలతో అభివృద్ధి చేశారు. చాలా సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ఈ శ్మశానవాటిక రూపురేఖలు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సహకారంతో మారాయి. గంగూరు గ్రామంలో దాదాపు ఎకరంన్నరలో ముస్లిం శ్మశానవాటిక ఉంది. గత ప్రభుత్వాలు దీనిని ఎటువంటి అభివృద్ధి చేయలేదు. దీంతో గ్రామంలో ముస్లింలు చాలా ఇబ్బందులు పడేవారు. అయితే గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి రూ.24 లక్షలు మంజూరు చేశారు. గ్రామంలో ముస్లిం మత పెద్దల సూచనలతో శ్మశానవాటికకు ఏడు అడుగుల ఎత్తులో ప్రహరీ నిర్మాణం చేశారు. ఆర్చి, ఐరన్ గేట్లు ఏర్పాటు చేశారు. వర్షం వస్తే మునిగిపోకుండా ప్రాంగణాన్ని నాలుగు అడుగుల ఎత్తు మట్టితో ఫిల్లింగ్ చేశారు. శ్మశానవాటిక ప్రాంగణంలో పిచ్చి మొక్కలు తొలగించారు. పరిసర ప్రాంతాలు రోడ్లతో అభివృద్ధి చేశారు. దీంతో దీర్ఘకాల సమస్య పరిష్కారమైనందుకు గ్రామంలో ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథికి గ్రామ సర్పంచ్ తస్లీమున్నీసా, గ్రామంలోని ముస్లిం పెద్దలు ధన్యవాదాలు తెలిపారు.

సేవకు మారుపేరు నర్సింగ్ వృత్తి



గన్నవరం రూరల్: సేవకు మారుపేరు నర్సింగ్ వృత్తి అని ఏపీ ఎన్ఎంసీ(నర్సింగ్ మెడికల్ కౌన్సిల్) రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల చెప్పారు. మండలంలోని డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, డాక్టర్ పిసిమ్స్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్య సంస్థల్లో శుక్రవారం జరిగిన ల్యాంప్ లైటింగ్ సెర్మనీకి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని, ఆ విద్యలో ప్రవేశించిన విద్యార్థులు క్రమశిక్షణగా చదివి ఉన్నతంగా ఎదగాలని చెప్పారు. ఇద చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని కళాశాల కన్వీనర్ వి.శశికళ పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, శారద విద్యా సంస్థల సీఈవో వై.శారద, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.వందన తదితరులు పాల్గొన్నారు.

పేదల భవితకు వైఎస్సార్ సీపీ



ఆత్కూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ సరోజిని, నాయకులు

ఉంగుటూరు: పేదల భవితకు వైఎస్సార్ సీపీ భరోసాగా నిలుస్తోందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. ఆత్కూరులో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్' నిర్వహించారు. ఎంపీపీ స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇళ్లకు జగనన్న స్టిక్కర్లు అతికించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ పాలనలో తేడాలను వివరించారు. మరోసారి జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రావాలంటే ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సింహాచలం, వెల్దిపాడు సర్పంచ్ లాం నాగేశ్వరరావు, నాయకులు భీమవరపు యతేంద్ర, రామకృష్ణ, ఆశీర్వదం, నాని బాబు, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం: అల్లాపురంలో గ్రామ సర్పంచి డొక్కు సాంబశివవెంకన్నబాబు నేతృత్వంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఉప సర్పంచి ఆవుటపల్లి శివప్రసాద్, వార్డు సభ్యులు, పార్టీ నేతలు పాల్గొన్నారు. స్థానిక గ్రామసచివాలయం-4 పరిధిలో ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి, పార్టీ నాయకులు తిరివీధి వెంకయ్య, రాచేటి రూతమ్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామసచివాలయం-3 పరిధిలో సచివాలయ కన్వీనర్లు జలసూత్రం రామ్మోహన్‌రావు, చిమట శ్రీనివాసరావు, కాసరనేని అజయ్‌కుమార్, లుక్కా ప్రసాద్ ఇంటింటికీ ప్రచారం చేశారు.

మెరుగుపడతామని 15 కాసుల బంగారం అపహరణ



సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా గుర్తించిన దొంగలు వీరే

గన్నవరం: బంగారం మెరుగు పెడతామని ఓ వృద్ధురాలికి మాయమాటలు చెప్పి 15 కాసుల ఆభరణాలను అపహరించుకుపోయిన ఇద్దరు ఘరానా మోసగాళ్ల ఉదంతం శుక్రవారం గన్నవరంలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం.. స్థానిక పాతగన్నవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో నర్రా సుబ్బారావు, విజయలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బంగారం మెరుగు పెడతామని బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వీరి మాటలు నమ్మిన విజయలక్ష్మి సుమారు 15 కాసుల విలువైన బంగారు గొలుసు, గాజులు, ఉంగరాలను మెరుగుపెట్టేందుకు వారికి ఇచ్చింది. బంగారు ఆభరణాలను శుభ్రపరచడానికి వేడి నీళ్లు కావాలని అడగడంతో ఆమె వంట గదిలోకి వెళ్లింది. ఇంతలో బంగారు ఆభరణాలు తీసుకుని ఇరువురు వ్యక్తులు బైక్‌పై పరారయ్యారు. వేడినీళ్లతో బయటకు వచ్చిన ఆమె మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఎస్ఐ శ్రీనివాస్ నేతృత్వంలోని సిబ్బంది బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల నుంచి సేకరించిన ఫుటేజ్ ఆధారంగా దొంగలు బిహార్ బ్యాచ్‌గా పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

'కాస్ట్లీ కోరికలు' ట్రైలర్ విడుదల

గన్నవరం: బ్లాక్ స్పేస్ ప్రొడక్షన్స్‌పై గన్నవరం ప్రాంతానికి చెందిన యువకులు రూపొందించిన 'కాస్ట్లీ కోరికలు' సినిమా ట్రైలర్‌ను శుక్రవారం సినీ నిర్మాత, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చేతుల మీదుగా లాంచ్ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... సినీ రంగంలో ప్రతిభావంతులైన యువత వినూత్న కథలతో ముందుకు వస్తున్నారని చెప్పారు. యదార్థ సంఘటనల ఆధారంగా సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను రూపొందించిన దర్శకుడు ఎస్‌వీవీ సాయికుమార్‌రాజు బృందాన్ని ఎమ్మెల్యే వంశీమోహన్ అభినందించారు. ఓటీటీలో విడుదల కానున్న సినిమా విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఎంపీపీ అనగాని రవి, సినిమా నిర్మాత ఎస్‌వీవీ ఝాన్సీలక్ష్మి, హీరో సుభాష్, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్ ఆర్యన్‌వంశీ, నటులు వరుణ్, దీపక్, రత్నసాయి, ఉదయ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైడే

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన డ్రైడే నిర్వహించారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశాలు పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించారు. ఇళ్లలో నీరు నిల్వ ఉన్న పాత్రలు గుర్తించి ఆ నివాసాల యజమానులతో మాట్లాడి ఆ నీటిని పారబోయించారు. మండల వైద్యాధికారి జె.సంధ్య మాట్లాడుతూ ఇళ్లల్లో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే దోమల వ్యాప్తిని నిరోధించవచ్చని చెప్పారు.

కాటూరు పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీలు



కాటూరు పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి

ఉయ్యూరు: మండలంలోని కాటూరు పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.గీతాబాయి శుక్రవారం తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సేవలపై రోగులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముఖ ఆధారిత హాజరు రికార్డులను పరిశీలించారు. ఓపీ విభాగం, ల్యాబ్ సందర్శించి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష చేశారు. అనంతరం మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమర్థంగా విధులు నిర్వర్తించాలని, ఉత్తమ సేవలతో ప్రజల మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కొంతి శివరామకృష్ణ, ఎంపీహెచ్ఈఓలు నాగార్జునబాబు, రత్నబాబు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్‌లలో మౌలిక వసతులు కల్పిస్తాం



ఉయ్యూరు మండలం చిన ఓగిరాల గ్రామంలో పర్యటిస్తూ బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: జగనన్న లే అవుట్‌లలో మౌలిక వసతులు కల్పించి గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన వివరించి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు జగనన్న లే అవుట్‌లలో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ లే అవుట్‌కు వెళ్లే రహదారిని అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించి అందుబాటులోకి తెస్తామన్నారు. గృహాలు నిర్మించుకుని నివాసం ఉండేందుకు అనువుగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. త్వరలోనే ఇళ్ల ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మళ్లీ ప్రజాశీర్వాదం ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దాసే రవి, ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, నాయకులు మంచిగంటి రమేష్, కొడాలి నాగేశ్వరరావు, మత్తె భాను, కొడాలి విశ్వేశ్వరరావు, వల్లూరు రామారావు పాల్గొన్నారు. చిన ఓగిరాల పీఏసీఎస్‌లో సభ్యులైన పాలడుగు కృష్ణారావు ఇటీవల మృతి చెందగా కృష్ణారావు కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం ఎమ్మెల్యే పార్థసారథి చేతుల మీదుగా అందించారు.

జగనన్నతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

కంకిపాడు: జగనన్నతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహ సారథులు, కన్వీనర్లకు ప్రచార సామగ్రిని అందించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలన్నారు. ప్రజలు బాసటగా నిలిచేలా వాస్తవాలను తెలియజెప్పాలన్నారు. జగనన్న సచివాలయాల మండల చైర్మన్ రాచూరి చిరంజీవి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు విజయచంద్రశేఖర్, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ కాగిత శివన్నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కాగిత రాజా రమేష్, కలపాల సురేష్, చుండూరు మోహన్‌రావు, చెన్ను బాబూజీ, వై.సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి చర్యలు

కంకిపాడు: ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ కె.బి.సుకన్య తెలిపారు. ఆమె శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్త కంకిపాడు మండలంలోని ఉప్పలూరు -5 (ఎస్సీ), అంగన్‌వాడీ సహాయకులు కంకిపాడు-1 (బీసీ-ఏ), మారేడుమాక (ఎస్సీ), ఉప్పలూరు-2 (బీసీ-బీ), పెనమలూరు మండలం కానూరు-8 (బీసీ-ఏ), తాడిగడప-3 (జనరల్)కు రిజర్వు అయ్యాయన్నారు. అర్హత గల అభ్యర్థులు రెండు సెట్ల దరఖాస్తులను మే 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రాజెక్టు కార్యాలయంలోసంప్రదించాలన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి సీడీపీఓ కె.బి.సుకన్య తెలిపారు. కాటూరు-8 అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్సీ), ఆకునూరు-3 అంగన్‌వాడీ సహాయకురాలు (జనరల్), ఉయ్యూరు మున్సిపాలిటీలోని లంబాడీపేట-1 అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్టీ), కొబ్బరితోట అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ-డీ)కి రిజర్వు అయ్యాయన్నారు. తోట్లవల్లూరు మండలంలోని దేవరపల్లి-2 అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్సీ), పమిడిముక్కల మండలంలోని వీరంకిలాకు అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ-బీ), కపిలేశ్వరపురం-2 అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ-డీ)కి రిజర్వు అయ్యాయన్నారు. అర్హత గల అభ్యర్థులు రెండు సెట్లతో కూడిన దరఖాస్తు ఫారాలను మే 1 సాయంత్రం 5 లోపు కార్యాలయంలో అందించాలన్నారు.